క్లుప్తంగా

సన్యాసినీలాపురంలో అన్నదానం

టెక్కలి: మండలంలోని గూడెం పంచాయతీ సన్యాసినీలాపురం గ్రామంలో మంగళవారం అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. భవానీ దీక్షలు చేపట్టిన స్వాములంతా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు భారీగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అంతకు ముందు స్వాములంతా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

12న సాయిబాబా మహాసమాధి



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి శివాజీనగర్‌లోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈనెల 12వ తేదీన బాబా 106వ పుణ్యతిథి జరుగుతుందని ఆలయ ధర్మకర్త, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ బాబా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాయినాథ్ మహాసమాధి, విజయ దశమి సందర్భంగా విశేష పూజలను ఆలయ ప్రధాన అర్చకులు ధర్మపురి వాయునందశర్మ నిర్వహిస్తారన్నారు. అలాగే ఆ రోజు ఉదయం పది గంటలకు భక్తులచే అన్నాభిషేకం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేయనున్నట్టు చెప్పారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఏకనామ సంకీర్తన, ఏకాహం జరుపుతామన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల సమావేశం

సోంపేట: మండల సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరులు మంగళవారం తెలిపారు. ఉదయం పది గంటలకు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన ప్రారంభం కానున్న సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

నందిగాం: నందిగాం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

దోమపోటు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సైలాడలో జిల్లేడు ద్రావణం తయారు చేస్తున్న దృశ్యం

నందిగాం: వరి పంటకు దోమపోటు సోకకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ అన్నారు. శివరాంపురం, సైలాడ పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సస్యరక్షణ, పంటల యాజమాన్య పద్ధతులు వివరించారు. దోమపోటు నివారణకు వినియోగించే జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్బి జానకీరాం, అట్టాడ సుదర్శనరావు, వెంకటరావు, వీఏఏలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం నృత్యకారులకు అరుదైన అవకాశం



ప్రదర్శనకు ఎంపికైన నాట్యకారులు

ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి దేవస్థానం సన్నిధిలో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశం స్థానిక వేంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులకు దక్కింది. ఈ విషయాన్ని అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి మంగళవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహతి ఆడిటోరియంలో ఈ నెల పదో తేదీన నిర్వహించనున్న కూచిపూడి, భరతనాట్యం సాంస్కృతిక నృత్యప్రదర్శన కార్యక్రమంలో స్థానిక నాట్యగురువు శృతిపట్నాయక్ ఆధ్వర్యంలో నాట్యకారులు డి.కావ్య, శైలు, పూజశ్రీ, సీహెచ్ జయలక్ష్మి, శ్వేతా, ప్రీతీ, జాగృతి, నిఖిత, దీపిక, శ్రీదీక్షిత నృత్యప్రదర్శన ఇవ్వనున్నట్లు చెప్పారు. నృత్య ప్రదర్శనకు ఎంపికన వారిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎంపీడీవోకు ఎంపీపీ అభినందన



ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ నీలవేణి, ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలాభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ నాయుడును తన కార్యాలయంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఆమెతో పాటు మండల ప్రత్యేకాధికారి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ ఉన్నారు.

భవనాలు శిథిలం
విధులంటే భయం

- అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాలు
- భయందోళనలో సిబ్బంది
- కొత్త భవనాలకు ప్రతిపాదనలతో సరి



శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయం

ఇచ్ఛాపురం రూరల్: అవి నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో కళకళలాడే ప్రభుత్వ భవనాలు. అయితే అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఫలితంగా క్షణం క్షణం భయంతో సిబ్బంది వాటిలో విధులు నిర్వహిస్తున్నారు. ఐదు దశాబ్దాల క్రితం ఇచ్ఛాపురంలో నిర్మించిన ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు పూర్తిగా శిథిలమయ్యాయి. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన మండల పరిషత్ కార్యాలయం మరీ ఘోరంగా ఉంది. అదే భవనంలోని మూడు గదుల్లో సిబ్బంది విధులు నిర్వహించగా, ఒక హాలును సమావేశాలకు కేటాయించారు. మరో రెండు గదుల్లో మండల వ్యవసాయ కార్యాలయం, ఎంపీపీ కార్యాలయం ఉంది. ఈ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడుపోతుండటంతో విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది, కార్యాలయానికి వచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు జంకుతున్నారు. వర్షం పడితే కార్యాలయం జలమయమవుతోంది.

తహసీల్దార్ కార్యాలయానిదీ అదే పరిస్థితి..

ఏడు దశాబ్దాల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయానిది కూడా అదే పరిస్థితి. పురాతనమైన భవనం కావడంతో పెంకులు ఊగిపోయి ఎండా కాలం సూర్య కిరణాలు, వర్షాకాలం వర్షం నీరు పైనుంచి నేరుగా గదుల్లోకి పడుతోంది. వర్షం వచ్చిన సమయంలో లబ్ధిదారులు ఈ కార్యాలయానికి గొడుగులు వేసుకొని రావాల్సిందే. గతంలో పలుమార్లు సిబ్బంది తలలపై పెచ్చులు పడటంతో చిన్నపాటి గాయాలతో బయటపడిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయం నీటితో నిండిపోతుంది. ఈ రెండు కార్యాలయాలను పరిశీలించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ భవనాలను పూర్తిగా నేలమట్టం చేసి ఇదే ప్రాంతంలో నూతన భవనం నిర్మాణానికి అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపించారు. ఎంపీడీవో కార్యాలయం నూతన భవనానికి రూ.1.20 కోట్లతో, రూ.90 లక్షలతో తహసీల్దార్ కార్యాలయం నూతన భవనానికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో ఎప్పుడూ కూలిపోతాయో తెలియని శిథిలమైన భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి నూతన భవనాలను నిర్మించేందుకు కృషి చేయాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.



వర్షం కురిసిన సమయంలో ఎంపీడీవో కార్యాలయంలో దుస్థితి



ఎంపీడీవో కార్యాలయ శ్లాబ్ పెచ్చులు ఊడిపోయిన దృశ్యం



వర్షం సమయంలో గొడుగుతో తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారుడు

10న 'మన పలాస-మన బాధ్యత'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: మన పలాస-మన బాధ్యత అనే కార్యక్రమాన్ని ఈ నెల పదో తేదీన నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష వెల్లడించారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పలాస నియోజకరవర్గంలో 250 కిలోమీటర్ల మేర ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓలు, వెలుగు సిబ్బందితో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ముందుకొస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. 50 కిలోమీటర్ల మేర యంత్రాలతో జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు కొంతమంది ముందుకొచ్చినట్టు చెప్పారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, గోవిందు పాపారావు, ఆర్అండ్‌బీ డీఈ సాసుమాన రామానాయుడు, జేఈ విక్రమ్, సంతోష్‌పండా, పాలవలస వైకుంఠరావు ఉన్నారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యంతో మేలైన దిగుబడులు



కొజ్జీరియాలో పొడ తెగులు లక్షణాల్ని రైతులకు వివరిస్తున్న ఏవో దుర్గాప్రసాద్

కవిటి: ఖరీఫ్ వరిసాగు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో సమగ్ర ఎరువుల యాజమాన్యంతోనే మేలైన దిగుబడులు సాధించగలమని మండలవ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. కొజ్జీరియా, కవిటి రెవెన్యూ గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాల్ని మంగళవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం చిరుపొట్ట దశలో యూరియా 15 కిలోలు, పొటాష్ 15 నుంచి 20 కేజీలు ఎకరానికి వేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ ఎంపీఈవో పూడి లలితాకుమారి మాట్లాడుతూ.. కొబ్బరి తోటలో అంతర పంటగా కోకో నాటుకోవాలి సూచించారు.

ఎస్పీని కలిసిన ఆర్డీవోలు



ఎస్పీ మహేశ్వరరెడ్డికి మొక్కను అందజేస్తున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలుగా బాధ్యతలు చేపట్టిన కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తిలు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రూప్-1లో మంచి ఉత్తీర్ణత సాధించి ఆర్డీవోలుగా ఎంపికైనందుకు ఎస్పీ అభినందించారు. తమ డివిజన్ల పరిధిలో రెవెన్యూ పరంగా మెరుగైన సేవలందించాలని సూచించారు. అనంతరం పరిపాలన, తదితర అంశాలపై మాట్లాడారు.

భవానీస్వామి రక్తదానం



రక్తదానం చేస్తున్న అనిల్

కాశీబుగ్గ: అత్యవసర పరిస్థితిలో ఉన్న మహిళకు భవానీస్వామి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పలాస కాపువీధికి చెందిన మహిళ ఎనిమిక్ (హిమోగ్లోబిన్ తక్కువ కావడంతో) సమస్యతో అత్యవసర పరిస్థితిలో పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో చికిత్స కోసం చేశారు. ఆమెకు రక్తం అవసరమని నవతరం సేవా సంఘానికి కుటుంబీకులు సమాచారం అందించారు. దీంతో పలాస రెడ్డికవీధికి చెందిన భవానీమాలధారణలో ఉన్న టీ దుకాణం నిర్వహించే అనిల్ ఏబీ పాజిటివ్ రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.

మృతుడి కుటుంబానికి రూ. లక్ష సాయం



గోవింద్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఐదో వార్డు తాళ్లభద్ర గ్రామానికి చెందిన బద్రి గోవింద్ గుండె పోటుతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బొడ్డపాడుకు చెందిన కిక్కర ఢిల్లీరావు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో మృతిని తల్లిదండ్రులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, నాయకులు గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, వంకల కూర్మారావు, బద్రి గోపాల్, దడియాల నరసింహులు, పాపారావు ఉన్నారు.

పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న పద్మావతి అమ్మవారు

ఇచ్ఛాపురం రూరల్: కీర్తిపురం గ్రామ దేవత పద్మావతి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో కొలుస్తారని అర్చకులు తెలిపారు. మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జీతాలు ఇప్పించాలని వినతి

కాశీబుగ్గ: జీతాలు చెల్లించి ఆదుకోవాలని పలస కిడ్నీ ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను బుధవారం తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వి.మనిషా, నల్లా సంధ్యారాణి, ఎం.రామస్వామి, ఎస్.వేణుగోపాల్, మౌనిక, మాధురి మనిచందన్ ఉన్నారు.

రోడ్డు పనులు పరిశీలన



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: అరకబద్ర-కొళిగాం బహుదానది మధ్య అప్రోచ్ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి బి.ధనుంజయం మంగళవారం రోడ్డు పనులు పర్యవేక్షించారు.

బదిలీ ఉద్యోగికి సత్కారం



మహేష్‌తో రేషన్ డీలర్లు

కంచిలి: మండల కేంద్రంలోని కంచిలి, సోంపేట, కవిటి మండలాల రేషన్ దుకాణాలకు నిత్యావసర సరకులు సరఫరా చేసే ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి కె.మహేష్ బదిలీపై సోంపేట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వెళుతున్నారు. ఈ సందర్భంగా మూడు మండలాల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో మహేష్‌ను మంగళవారం సన్మానించారు. అలాగే ఎంఎల్ఎస్ పాయంట్‌కు శ్రీకాకుళం నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వరరావు పాణిగ్రాహికి స్వాగతం పలికారు. డీలర్ల సంఘాల అధ్యక్షులు కొత్తకోట నాగరాజు, సానా షణ్ముఖరావు, వేణు బిసాయి, డీలర్లు ప్రసాద్, పి.సి.పండా, రిషి, విక్రమ్, తిరుపతి, విజయ్, మోహనరావు ఉన్నారు.

జగన్మాతా పాహిమాం..



ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేటలో సామూహిక కుంకుమ పూజలో మహిళలు

శరన్నవరాత్రి ఉత్సవాలు ఊరూరా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం వివిధ అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పలు మండపాల వద్ద దీపారాధనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రజాప్రతినిధులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు.



నందిగాం దుర్గాదేవి మండపం వద్ద సామూహిక కుంకుమ పూజలు



టెక్కలి భవానీనగర్‌లో మహాలక్ష్మి అవతారంలో మరకత శివ దుర్గా అమ్మవారు



కవిటి:రాజపురం దుర్గామాతను దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



వజ్రపుకొత్తూరు: పూండిలో మహిళల కుంకుమ పూజలు



సోంపేట: మహాలక్ష్మీదేవిగా సోంపేట సోమపోలమాంబ



ఇచ్ఛాపురం:కాత్యాయని అవతారంలో గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారు



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు



కాశీబుగ్గ: పద్మనాభపురంలో కుంకుమ పూజలు



వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన కంచికామాక్షి అమ్మవారు



కంచిలి రైల్వే స్టేషన్ ఆవరణలోని మండపం వద్ద లక్ష దీపారాధన

సంక్షిప్తంగా...

ఆటో డ్రైవర్ల శ్రమదానం

పలాస: బొడ్డపాడు చింతలపోలమ్మ ఆటో డ్రైవర్లు శ్రమదానంతో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలను మంగళవారం తొలగించారు. యూనియన్ సభ్యులంతా పారా పలుగులు పట్టుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న జీడి చెట్ల కొమ్మలను, పిచ్చిమొక్కలను తొలగించారు. అలాగే పొక్లయినర్‌తో రోడ్డుకు ఆనుకొని ఉన్న మట్టిని సదును చేశారు. బొడ్డపాడు నుంచి గరుడబద్ర వరకు సుమారు మూడు కిలోమీటర్లు పొడవున ఈ పనులను చేపట్టారు. యూనియన్ నాయకులు గర్తం తులసి, వంకల అప్పారావు, పోతనపల్లి మల్లేశ్వరరావు ఉన్నారు.

నేడు సోలార్ రూఫ్‌టాప్ ఎనర్జీపై సదస్సు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి తిలక్‌నగర్‌లో ప్రధాన మంత్రి సూర్యఘర్ (సోలార్ రూఫ్ టాఫ్ ఎనర్జీ)పై బుధవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పలాస డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ జి.యగ్నేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిసర ప్రాంతీయులు, ఔత్సాహికులు హాజరు కావాలని కోరారు.

కొత్త వాహనాలకు పూజలు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి సన్నిధిలో పలువురు కొత్త ట్రాక్టర్లకు మంగళవారం పూజలు చేశారు. దసరా ముందు వచ్చే మంగళవారం కొత్త వాహనాలు ప్రారంభించడం ఆనవాయితీ. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా కనిపించింది. గురువారం కొత్తమ్మ తల్లి మారుజాతరను పురస్కరించుకొని భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేయనున్నట్టు ఆలయ ఈవో వి.రాధాక్రిష్ణ తెలిపారు.

మద్యం దుకాణాలకు 88 దరఖాస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: మద్యం షాపుల అనుమతి కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.మల్లికార్జునరావు తెలిపారు. 15 మద్యం దుకాణాల కోసం మంగళవారం నాటికి 88 దరఖాస్తులు అందినట్టు చెప్పారు. వీటిలో వజ్రపుకొత్తూరు మండలంలో ఐదు షాపులకు 40, కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఏడు షాపులకు 36, పలాస రూరల్ పరిధిలో మూడు షాపులకు 12 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు బుధవారం సాయంత్రం ఐదు గంటల్లోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

మురుగు సమస్య లేకుండా చూడాలి

టెక్కలి: టెక్కలి పట్టణంలో మురుగు సమస్య లేకుండా చూడాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం తొలుసూరుపల్లి రోడ్డులో మురుగు నీటి సమస్య ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మురుగు సమస్య లేకుండా పంచాయతీ యంత్రాంగం చొరవ చూపాలన్నారు. తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, పంచాయతీ ఈవో జగన్నాథం ఉన్నారు.

ఘనంగా పత్రికొమ్మల పండుగ

పలాస/కాశీబుగ్గ: బొడ్డపాడు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం పత్రికొమ్మల పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు. దసర ఉత్సవాలలో ముఖ్యమైన ఈ పండుగలో పంట పొలాలు ఉన్న రైతులు మాత్రమే పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న చింతలపోలమ్మ అమ్మవారి ఆలయం వద్దకు పత్రి కొమ్మలతో చేరుకుని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి పసుపుపత్రిని కొమ్మలపై వేసి వాటిని పంటపొలాల్లో పాతడానికి పరుగులు పెట్టి ఆనవాయితీ నిర్వహించారు.సాయంత్రం అమ్మతల్లి వద్ద మొక్కలు చెల్లించుకున్నారు.